ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి

తెలుగు దిన పత్రిక

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :129 గురువారం మార్చి 5 2026, పేజీలు - 4 వేల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH

## తెలంగాణలో జనగణన తొలి దశకు సిద్ధం


**-మే 11 నుంచి ఇళ్ల వివరాల నమోదు**

**-దేశంలోనే తొలిసారి పూర్తిస్థాయి డిజిటల్ జనగణన**

**-పక్కాగా వివరాలు నమోదు చేయాలని సీఎస్ ఆదేశం**



హైదరాబాద్, మార్చి 4 (మనప్రజాప్రతినిధి): దేశవ్యాప్తంగా జరగనున్న జాతీయ జనాభా గణన ప్రక్రియలో భాగంగా తెలంగాణలో తొలి దశ పనులను పకడ్బందీగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. మే 11 నుంచి జూన్ 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లు, ఇతర కట్టడాల వివరాలను నమోదు చేసే కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో జిల్లా కలెక్టర్లు, అన్ని శాఖల కార్యదర్శులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన కీలక మార్గదర్శకాలు జారీ చేశారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామం, మండలం పరిధిలోని ఇళ్లు, కట్టడాల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ఈసారి జనగణన ప్రక్రియలో దేశ చరిత్రలోనే తొలిసారి పూర్తిస్థాయి డిజిటల్ విధానాన్ని అమలు చేయనున్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది ప్రత్యేక మొబైల్ అప్లికేషన్ ద్వారా నేరుగా స్మార్ట్ ఫోన్లలో వివరాలను నమోదు చేస్తారు. అంతేకాకుండా పౌరులు తమ వివరాలను తామే నమోదు చేసుకునే విధంగా "సెల్ఫ్ ఎన్యూమరేషన్" కోసం ప్రత్యేక ఆన్‌లైన్ వేదికను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ ప్రక్రియ మే 11కు 15 రోజుల ముందే ప్రారంభమవు తుందని అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాంతాన్ని కచ్చితంగా కవరయ్యేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ స్పష్టం చేశారు.



మారుమూల గిరిజన తండాలు, పట్టణాల్లోని మురికివాడలతో సహా ఏ ఒక్క కట్టడాన్ని కూడా వదిలిపెట్టకుండా జాబితాలో చేర్చాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి గణకులు, పర్యవేక్షకులకు సమగ్ర శిక్షణ ఇవ్వాలని కలెక్టర్లకు సూచించారు. ఈ సమావేశంలో జనాభా లెక్కల విభాగం రాష్ట్ర సంచాలకురాలు భారతీ హోళికెరి కూడా పాల్గొన్నారు. డేటా సేకరణ కోసం రూపొందించిన మొబైల్ అప్లికేషన్ పనితీరు, సమాచార భద్రతకు తీసుకుంటున్న చర్యలను ఆమె వివరించారు. డిజిటల్ విధానం వల్ల సమాచార సేకరణలో పారదర్శకత పెరగడంతో పాటు భవిష్యత్ ప్రభుత్వ పథకాల రూపకల్పనకు ఖచ్చితమైన గణాంకాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు.

## అధికారుల బదిలీలతో పాలన దెబ్బతింటోంది హరీశ్ రావు

**- రేవంత్ ప్రభుత్వానికి పాలన చేయడం రావడం లేదని విమర్శ**

**- తరచూ బదిలీలతో శాఖలు అతలాకుతలమయ్యాయని ఆరోపణ**

**- ప్రభుత్వానికి నిర్మాణాత్మక సూచనలు చేస్తున్నామని వ్యాఖ్య**



హైదరాబాద్, మార్చి 4 (మనప్రజాప్రతినిధి): తెలంగాణలో అధికారుల తరచూ బదిలీల వల్ల పాలన దెబ్బతింటోందని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు విమర్శించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డికు పాలన చేయడం రాకపోవడంతోనే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను తరచూ బదిలీ చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఐదుసార్లు భారీ స్థాయిలో అధికారుల మార్పులు జరిగాయని హరీశ్ రావు తెలిపారు. విభాగాధిపతులు సగటున ఎనిమిది నెలలు కూడా ఒకే పదవిలో కొనసాగడం లేదని పేర్కొన్నారు. విద్యుత్ శాఖ, సింగరేణి, జీహెచ్ఎంసీ, ఐ అండ్ పీఆర్, పాఠశాల విద్య, మున్సిపల్, పంచాయతీరాజ్ వంటి అనేక శాఖల్లో అధికారులు తరచూ మారడంతో పాలనలో గందరగోళం నెలకొంటోందని విమర్శించారు. ఇప్పటివరకు దాదాపు 140 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేశారని, 20 మంది కలెక్టర్లను మార్చారని హరీశ్ రావు పేర్కొన్నారు. ఒక కలెక్టర్‌కు జిల్లాపై పూర్తి అవగాహన రావడానికి కనీసం ఆరు నెలలు పడుతుందని, అంతకంటే ముందే బదిలీ చేయడం వల్ల పరిపాలనలో ఫలితాలు రావడం లేదన్నారు. అధికారులకు నచ్చితే మంచి పోస్టింగ్‌లు, లేదంటే వెంటనే బదిలీలు చేస్తున్నారని ఆరోపించారు. పదవీ విరమణ చేసిన అధికారులకు సేవా పొడగింపులు ఇవ్వడం కూడా పెరిగిపోయిందని ఆయన విమర్శించారు. గతంలో ఇదే విషయంపై విమర్శలు చేసిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు అదే విధానాన్ని కొనసాగిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం తమ సూచనలను విమర్శలుగా కాకుండా నిర్మాణాత్మక సలహాలుగా స్వీకరించాలని హరీశ్ రావు కోరారు.

## కాణిపాకంలో వరసిద్ధి వినాయక స్వామిని దర్శించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**- కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు**

**- పండితుల వేదాశీర్వచనాలు స్వీకరణ**



చిత్తూరు, మార్చి 4 (మనప్రజాప్రతినిధి): రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చిత్తూరు జిల్లా ఐరాల మండలం కాణిపాకంలో ఉన్న శ్రీ స్వయంభూ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంను కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. దర్శనం అనంతరం ఆలయ పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనాలు అందించగా, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటాన్ని అందజేసి ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా స్వామివారి కృపాకటాక్షాలతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా అభివృద్ధి చెందాలని మంత్రి ప్రార్థించారు. దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు.

## సింగూరు ప్రాజెక్టు డ్యాం భద్రతపై మంత్రుల సమీక్ష

**-సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశం**

**-డ్యాం భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశం**

**-పెద్దారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు వేగవంతం చేయాలని సూచన**




హైదరాబాద్, మార్చి 4 (మనప్రజాప్రతినిధి): రాష్ట్ర సచివాలయంలో సింగూరు ప్రాజెక్టు డ్యాం భద్రతపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, మైనింగ్ మరియు ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. సింగూరు డ్యాం భద్రత రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమైన అంశమని మంత్రులు పేర్కొన్నారు. జాతీయ డ్యాం భద్రత సంస్థ రూపొందించిన నిబంధనల ప్రకారం డ్యాం సంరక్షణ చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు ఆదేశించారు. డ్యాం భద్రత పనులపై ప్రత్యేక సాంకేతిక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. ఆందోల్ నియోజకవర్గంలో సుమారు నలభై వేల ఎకరాలకు సాగునీరు అందించే పెద్దారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం డీపీఆర్‌లను త్వరితగతిన సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఉగాది నాటికి ఈ పథకం పనులకు శంకుస్థాపన చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సింగూరు ప్రాజెక్టు కాలువల లైనింగ్ పనులను జూన్ 26 నాటికి పూర్తి చేయాలని, ప్రాజెక్టు సుందరీకరణ మరియు పరిరక్షణ పనులను వెంటనే ప్రారంభించాలని మంత్రులు ఆదేశించారు. ఆందోల్ నియోజకవర్గంలోని చెరువుల పునరుద్ధరణ పనులను వేగవంతం చేసి ఈ సీజన్‌లోనే రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఈ. శ్రీధర్, ఈఎన్సీలు రమేష్ బాబు, శ్రీనివాస్, టి. శ్రీనివాస్, సంగారెడ్డి జిల్లా ఇరిగేషన్ శాఖ అధికారులు మరియు ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి హైడ్రా కమిషనర్

**-బాచుపల్లి అగ్నిప్రమాద స్థలాన్ని పరిశీలన**

**-వేసవిలో అగ్నిప్రమాదాల ప్రమాదం ఎక్కువ**

**-ఫైర్ సేఫ్టీ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచన**



హైదరాబాద్, మార్చి 4 (మనప్రజాప్రతినిధి): వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో అగ్నిప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. బాచుపల్లి ప్రధాన రహదారిలో మంగళవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమైన ఫర్నిచర్ దుకాణాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఘటనకు గల కారణాలపై అక్కడి దుకాణాల నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షార్ట్ సర్క్యూట్ జరిగి నిప్పు రవ్వలు దుకాణాలకు అంటుకోవడంతో మంటలు వ్యాపించినట్లు కొందరు తెలిపారు. మరికొందరు పైగా వెళ్తున్న విద్యుత్ తీగ తెగి మంటలు చెలరేగినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడిన కమిషనర్ వేసవిలో అగ్నిప్రమాదాల ప్రమాదం అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అగ్నిప్రమాదాలు ఎందుకు జరుగుతాయో అవగాహన పెంపొందించుకుని వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. బాచుపల్లి ఘటనలో 22కి పైగా ఫర్నిచర్ దుకాణాలు పూర్తిగా దగ్ధమయ్యాయని తెలిపారు. ఒక్కో దుకాణంలో సుమారు రూ.25 లక్షలకు పైగా విలువైన సామగ్రి ఉండటంతో వ్యాపారులకు తీవ్ర నష్టం వాటిల్లిందని చెప్పారు. నష్టపరిహారం అంశాన్ని రెవెన్యూ శాఖ పరిశీలిస్తుందని వెల్లడించారు. తనిఖీలు మాత్రమే సరిపోవని, ఫైర్ సేఫ్టీ నిబంధనలు అందరూ తప్పనిసరిగా పాటించినప్పుడే ఇలాంటి ప్రమాదాలు తగ్గుతాయని కమిషనర్ స్పష్టం చేశారు. ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకునే అధికారాన్ని హైడ్రాకు ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదించామని తెలిపారు.

## అక్రమ ఇసుక తవ్వకాలపై సాంకేతిక నిఘా

**- రాజమహేంద్రవరంలో ఏఐ కెమెరాలతో పర్యవేక్షణ**

**- రాత్రి వేళల్లో అక్రమ తవ్వకాలను గుర్తించేందుకు థర్మల్ డ్రోన్లు**

**- కేంద్ర నియంత్రణ వ్యవస్థ ద్వారా ప్రత్యక్ష పర్యవేక్షణ**

2



# అక్రమ ఇసుక తవ్వకాలపై సాంకేతిక నిఘా

మెదటి పేజీ తరువాయి రాజమహేంద్రవరం, మార్చి 4 (మనప్రజాప్రతినిధి): తూర్పు గోదావరి జిల్లాలో అక్రమ ఇసుక తవ్వకాలను అరికట్టేందుకు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నారు. ముఖ్యంగా రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో ఇసుక రవాణా, తవ్వకాలపై నిఘా పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా కృత్రిమ మేధస్సు ఆధారిత సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి ఇసుక రవాణా చేసే వాహనాల వివరాలను పర్యవేక్షిస్తున్నారు. ఈ కెమెరాలు వాహనాల సంఖ్య, రవాణా మార్గాలు వంటి సమాచారాన్ని స్వయంచాలకంగా గుర్తించి అధికారులకు అందజేస్తాయి. అక్రమ తవ్వకాలు ఎక్కువగా రాత్రి సమయంలో జరుగుతున్న నేపథ్యంలో థర్మల్ డ్రోన్లను వినియోగిస్తున్నారు. ఇవి చీకట్లో కూడా స్పష్టంగా కార్యకలాపాలను గుర్తించి అధికారులకు సమాచారం అందిస్తాయి. దీంతో అక్రమ తవ్వకాలపై త్వరితగతిన చర్యలు తీసుకునే అవకాశం ఏర్పడుతోంది. ఈ మొత్తం వ్యవస్థను కేంద్ర కమాండ్ కేంద్రం ద్వారా ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. ఈ చర్యల ద్వారా నదీ వనరులను సంరక్షించడంతో పాటు అక్రమ ఇసుక తవ్వకాలపై కట్టడి సాధించాలనే లక్ష్యంతో అధికారులు ముందుకు సాగుతున్నారు.

# ఎర్రచందనం స్మగ్లింగ్‌పై ఏపీ పోలీసుల భారీ దాడి

**-రూ.5 కోట్ల విలువైన ఎర్రచందనం స్వాధీనం**
**-ఎనిమిది మంది అంతర్రాష్ట్ర స్మగ్లర్ల అరెస్టు**
**-కర్ణాటకలో సంయుక్త ఆపరేషన్**



మార్చి 4 (మనప్రజాప్రతినిధి): ఎర్రచందనం అక్రమ రవాణాపై ఆంధ్రప్రదేశ్ పోలీసుల ప్రత్యేక దళం భారీ దాడి నిర్వహించి కోట్ల విలువైన సరుకును స్వాధీనం చేసుకుంది. ఈ ఆపరేషన్‌లో సుమారు రూ.5 కోట్ల విలువైన ఎర్రచందనం దుంగలను పట్టుకుని ఎనిమిది మంది అంతర్రాష్ట్ర స్మగ్లర్లను అరెస్టు చేశారు పోలీసుల సమాచారం మేరకు కేసు నంబరు 02/2026కు సంబంధించి పరారీలో ఉన్న నిందితులను పట్టుకునేందుకు టాస్క్ ఫోర్స్ బృందం కర్ణాటక రాష్ట్రంలోని హసన్ జిల్లా అర్సికెరే తాలూకా పరిధిలోని సిద్ధాపుర, హరతనహళ్లి గ్రామాలకు వెళ్లింది. కర్ణాటక పోలీసుల సహకారంతో అక్కడి గోదామును తనిఖీ చేయగా, పోలీసులను గమనించిన కొందరు వ్యక్తులు మూడు వాహనాల్లో పారిపోవడానికి ప్రయత్నించారు. అయితే టాస్క్ ఫోర్స్ సిబ్బంది వెంటాడి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులిచ్చిన సమాచారం మేరకు సమీపంలోని కోళ్ల ఫారం తరహాలో ఉన్న ఓ షెడ్‌ను తనిఖీ చేయగా, అక్కడ భారీగా ఎర్రచందనం నిల్వ ఉంచినట్లు గుర్తించారు. అక్కడి నుంచి 195 ఎర్రచందనం దుంగలు, సుమారు 8 టన్నుల బరువున్న చెక్కను స్వాధీనం చేసుకున్నారు. అదనంగా ఎర్రచందనం కోయడానికి ఉపయోగించే పరికరాలు, వ్యర్థ పదార్థాలు, అక్రమ రవాణాకు ఉపయోగించిన మూడు వాహనాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.




ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. పరారీలో ఉన్న మరికొందరు నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

# ఇన్‌స్టా పరిచయాలు.. పిల్లలపై తల్లిదండ్రుల నిఘా అవసరం

**-సోషల్ మీడియాలో పరిచయాలతో ఇల్లు విడిచి వెళ్లే ఘటనలు**
**-విశాఖ యువతి తిరుపతికి వెళ్లే ప్రయత్నం**
**-అప్రమత్తమైన పోలీసులు యువతిని తల్లిదండ్రులకు అప్పగింత**



మార్చి 4 (మనప్రజాప్రతినిధి): చిన్న వయసులోనే సామాజిక మాధ్యమాల ద్వారా ఏర్పడుతున్న పరిచయాలు యువతను తప్పుదోవ పట్టిస్తున్నాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికల్లో పరిచయమైన వ్యక్తుల కోసం కొందరు యువతీ యువకులు ఇల్లు విడిచి వెళ్లే ఘటనలు పెరుగుతున్నాయని తెలిపారు. తాజాగా విశాఖపట్నానికి చెందిన ఓ యువతి ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన యువకుడిని పెళ్లి చేసుకోవడానికి తిరుపతికి వెళ్లేందుకు సిద్ధమైంది. ఇంటర్ పరీక్ష రాసిన అనంతరం ఉచిత బస్సుల్లో ప్రయాణిస్తూ కావలి వరకు చేరుకుంది. అర్ధరాత్రి సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న యువతిని పోలీసులు గుర్తించి ఆరా తీశారు. ఆమె పరిస్థితిని తెలుసుకున్న పోలీసులు వెంటనే అప్రమత్తమై యువతిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆమె తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి వారి వద్దకు అప్పగించారు.సామాజిక మాధ్యమాల్లో ఎక్కువ సమయం గడిపే పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేకంగా నిఘా ఉంచాలని పోలీసులు సూచిస్తున్నారు. అపరిచితులతో పరిచయాలు పెంచుకోవడం వల్ల ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని హెచ్చరిస్తున్నారు.

# లారీ ని ఢీకొని వ్యక్తి మృతి



మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట మార్చ్ 04,:చేగుంట మండల పరిదిలోని స్టేషన్ మసాయిపేట్ వద్ద ఆగి ఉన్న లారీ ని డికొని వ్యక్తి మృతి చెందినట్టు చేగుంట ఎస్ఐ చైతన్య కుమార్ రెడ్డి తెలిపారు, మసాయిపేట్ మండలం పోతన్ పల్లి గ్రామానికి చెందిన బర్రె విజయ్ (35) తన బైక్ పైన తూప్రాన్ వెళుతుండగా స్టేషన్ మాసాపేట వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుండి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు, విషయం తెలుసుకున్న చేగుంట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు

# చిత్తూరులో కాల్పుల కలకలం

**- పేకాటలో బాకీ వివాదం రక్తపాతం**
**- యువకుడిని నాటు తుపాకీతో కాల్చి హత్య**
**- ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు**





చిత్తూరు, మార్చి 4 (మనప్రజాప్రతినిధి): చిత్తూరు జిల్లాలో కాల్పుల ఘటన కలకలం రేపింది. పేకాట ఆడుతున్న సమయంలో ఇద్దరు స్నేహితుల మధ్య డబ్బు బాకీ విషయంలో తలెత్తిన ఘర్షణ చివరకు హత్యకు దారితీసింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, చిత్తూరు రూరల్ మండలంలోని తుమ్మిందపాల్యం గ్రామానికి చెందిన యువకులు కలిసి పేకాట ఆడుతుండగా రూ.2 లక్షల బాకీ విషయంపై వాగ్వాదం జరిగింది. బాకీ ఎప్పుడు చెల్లిస్తావని అడగడంతో ఇద్దరి మధ్య మాటామాట పెరిగి తీవ్ర ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో ఢిల్లీ బాబు (26) అనే యువకుడు కోపంతో నాటు తుపాకీతో సాయికుమార్ (24) అనే యువకుడిపై కాల్పులు జరిపాడు. తీవ్రంగా గాయపడిన సాయికుమార్ అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. హత్యకు పాల్పడిన ఢిల్లీ బాబును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో తుమ్మిందపాల్యం గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# ఉపాధి హామీ పథకంపై వైఎస్ షర్మిల విమర్శలు

**-జాబ్ కార్డుల సంఖ్య భారీగా తగ్గిందని ఆరోపణ**
**-గత ఏడాదిలోనే లక్షల కార్డులు తొలగించారని విమర్శ**
**-100 రోజుల పని కూడా అందించడం లేదని వ్యాఖ్య**



అమరావతి, మార్చి 4 (మనప్రజాప్రతినిధి): గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డుల సంఖ్య గణనీయంగా తగ్గిందని ఆమె ఆరోపించారు. వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో రాష్ట్రంలో సుమారు ఒక కోటి పది లక్షల జాబ్ కార్డులు ఉండేవని, ప్రస్తుతం అవి కేవలం అరవై ఐదు లక్షలకు మాత్రమే పరిమితమయ్యాయని తెలిపారు. వివిధ కారణాలు చూపుతూ ప్రభుత్వం పెద్ద ఎత్తున కార్డులను తొలగిస్తున్నట్లు ఆమె విమర్శించారు. గత ఏడాదిలోనే సుమారు పద్దెనిమిది లక్షల యాభై వేల జాబ్ కార్డులను తొలగించినట్లు సమాచారం ఉందని పేర్కొన్నారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం ప్రతి కుటుంబానికి సంవత్సరానికి వంద రోజుల పని హామీగా ఇవ్వాల్సి ఉంటుందని గుర్తుచేశారు. కానీ ప్రస్తుతం సంవత్సరానికి యాభై ఎనిమిది రోజులు కూడా పని ఇవ్వడం లేదని షర్మిల విమర్శించారు. వంద రోజుల పని కూడా అందించలేని ప్రభుత్వం ఇప్పుడు 125 రోజుల పని ఇస్తామని చెప్పడం నమ్మశక్యం కాదని ఆమె వ్యాఖ్యానించారు.




# ప్రశంస పత్రం అందుకున్న విద్యుత్ ఏఎల్ఎం

మనప్రజాప్రతినిధి// దినపత్రిక,చేర్యాల, జనగామ: జనగామ నియోజకవర్గం, జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని లక్ష్మాపురం సబ్ స్టేషన్ లో ఏఎల్ఎం గా విధులు నిర్వహిస్తున్న పరశురాములు,ఉత్తమ సేవా గుర్తింపు లభించింది,లైన్మెన్ ది వస్,సందర్భంగా విద్యుత్ సంస్థ ఆయనకు ప్రశంస పత్రాన్ని ప్రకటించింది. సెలక్షన్ ఆఫీసర్ చేతుల మీదుగా పత్రాన్ని అందుకున్నారు విధి నిర్వహణలో ఆయన చూపుతున్న ఆసక్తికి అంకితభావానికి అధికారులు అభినందించారు.ఈ పురస్కారం తోటి సిబ్బందికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ కలెక్టర్ హైమావతి



మన ప్రజాప్రతిని కొండపాక : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హైమావతి ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అటెండెన్స్ రిజిస్టర్, ఓపి రిజిస్టర్ వెరిఫై చేశారు. పిహెచ్సి పరిధిలోని ఆయా గ్రామాలలో గల సబ్ సెంటర్ లో ప్రజలకు ఎలా వైద్యం చేస్తున్నారని ఆరా తీశారు. ఆసుపత్రిలో మెడికల్ ఆఫీసర్ నుండి కింది స్థాయి సిబ్బంది వరకు సమయ వేళలు పాటిస్తూ విధులు సక్రమంగా నిర్వహించాలని మెడిసిన్, వైద్య పరికరాలు అన్ని అందుబాటులో ఉంచుకుంటు రోగులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయాలని ఆదేశించారు.

## ఈ నెల 9న బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో జరిగే ధర్నాలు నిరసన కార్యక్రమాలు జయప్రదం చేయండి



హైదరాబాద్ (మన ప్రజా ప్రతినిధి దినపత్రిక )త్వరలో తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశ పెట్టనున్న బడ్జెట్లో బీసీలకు 50 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈనెల తొమ్మిదవ తేదీన రాష్ట్రవ్యాప్తంగా తహసిల్దారు ఆర్డిఓ మరియు కలెక్టర్ కార్యాలయాల ముందు జరిగే ధర్నాలను విజయవంతం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు విజ్ఞప్తి చేశారు. బుధవారం నాడు ఆయన హైదరాబాదులోని హిమాయత్ నగర్ లో గల బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యాలయంలో ముఖ్య బీసీ నేతలతో కలిసి మాట్లాడుతూ.... కామారెడ్డి బిసి డిక్లరేషన్ లో బీసీల అభివృద్ధి కొరకు ప్రతి బడ్జెట్లో 20000 కోట్లు కేటాయిస్తామని ప్రకటించారని ఐదు సంవత్సరాల కాలంలో లక్ష కోట్ల రూపాయలు బీసీల కొరకు కేటాయిస్తామని హామీ ఇచ్చి ఉన్నందున ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు బడ్జెట్లలో కేవలం 10000 కోట్లు మాత్రమే కేటాయించారని అందులో సగం కూడా ఖర్చు చేయలేదని అందువల్ల ఈ బడ్జెట్ లో నైనా 50 వేల కోట్ల రూపాయలు కేటాయించి బీసీల అభ్యర్థి కొరకు ఖర్చు పెట్టాలని ఎస్సీ సబ్ ప్లాన్ మాదిరిగానే బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేసి బీసీల భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆయన కోరారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో బీసీలకు 21 హామీలు ఇచ్చారని అందులో ఏ ఒక్కటి కూడా పూర్తి చేయలేదని తక్షణమే అఖిలపక్ష బీసీ సంఘాల సమావేశం ఏర్పాటు చేసి వారు ఇచ్చిన సూచనలను పాటించి బీసీల అభివృద్ధికి కట్టుబడి ఉండాలని ఇటీవల తెలంగాణ రాష్ట్రానికి విచ్చేసిన కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ పక్ష నాయకుడు రాహుల్ గాంధీ త్వరలో పార్లమెంటులో బీసీల కొరకు ప్రైవేటు బిల్లు ప్రవేశపెడతామని హామీ ఇవ్వాడాన్ని స్వాగతిస్తున్నామని దేశంలో 56% జనాభా గలిగిన బీసీల గురించి దేశంలో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో వారికి అండగా నిలిస్తే కాంగ్రెస్ పార్టీకి ఇండియా కూటమికి భవిష్యత్తు ఉంటుందని అనే విషయాన్ని గమనంలో ఉంచుకోవాలని ఆయన కోరారు. ఆయన వెంట బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిహెచ్ దశరథ సహాయ కార్యదర్శి విజయుడు పల్నాటి యాదయ్య చింతకింది కుమారస్వామి మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ఉన్నారు

## ఆయకట్టును స్థిరీకరించాలని మంత్రి ఉత్తమ్ కు ఎంపీ చామల వినతి



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,చేర్యాల, జనగామ నియోజకవర్గం :జనగామ నియోజకవర్గం,సిద్దిపేట జిల్లా పరిధిలోని రంగనాయక సాగర్ రిజర్వేయర్ నుంచి డి10 కెనాల్ నుంచి జనగామ నియోజకవర్గంలోని కొమురవెల్లి మండలంలోని తపాస్ పల్లి రిజర్వేయర్ డి3 కెనాల్ పరిధిలో ఉన్న ఆయకట్టును స్థిరీకరణ చేసి దూల్మిట్ట,చేర్యాల మండలాల పరిధిలోని కమలాయపల్లి,అర్జున్ పట్ల,ఆకునూరు,జాలపల్లి,లింగాపూర్,దూల్మిట్ట గ్రామాల పరిధిలోని సుమారు ఏడు వేల ఎకరాలకు రంగనాయక సాగర్ డి10 కెనాల్ కింద స్థిరీకరించాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల్ కిరణ్ కుమార్ రెడ్డి బుధవారం మర్యాదపూర్వకరం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.గతంలో కూడా అక్కడి రైతుల సమస్యను ఎంపీ దృష్టికి తీసుకురాగా కాల్వలను పరిశీలించి రైతులతో మాట్లాడిన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి,రైతుల అవసరాల నిమిత్తం మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిని కలిసిన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వినతి పత్రం సమర్పించిన తక్షణమే సానుకూలంగా స్పందించిన మంత్రి టెంపర్వరి జీవోను అమలు చేసి రైతులకు సాగునిరు అందించారు.రాబోయే ఎండాకాలన్ని దృష్టిలో పెట్టుకొని బుధవారం నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి చెరువులలోనికి నీటిని విడుదలచేసి రైతన్నలకు సాగునీరు అందించాలని కోరారు. అలాగే గతంలో ఇచ్చిన టెంపర్వరి జీవో కాకుండా పర్మినెంట్ జీవో ఇవ్వాలని మంత్రిని,ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు.దీనివల్ల భూగర్భ జలమట్టం పెరిగి రైతులకు మేలు జరుగుతుందని అయన వివరించారు.ఈ విషయంపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్టు ఎంపీ చామల్ కిరణ్ కుమార్ రెడ్డి,పేర్కొన్నారు.

## పేదల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం

జనగామ నియోజకవర్గం,బచ్చన్నపేట మండలం, పోచన్నపేట గ్రామ మాల సామాజిక వర్గ కుటుంబానికి చెందిన సంగమల్ల.మహేందర్ అరుదైన కాళ్లలో బ్లడ్ క్లాటింగ్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఖరీదైన ఇంజెక్షన్ తీసుకుంటేనే జీవితం నిలబడే క్రమంలో నిరుపేద కుటుంబం కావడంతో స్థానిక సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకురాగా (2,50,000 రూాజ)రెండు లక్షల యాబై వేల రూపాయల ఎల్ ఓ సి,ని రాష్ట్ర మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ సహకారముతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ బాధితునికి అందజేశారు.ఈ కార్యక్రమంలో పోచన్నపేట గ్రామ శాఖ అధ్యక్షులు అంకిరెడ్డి శ్రీధర్,కొయ్యడి శ్రీనివాస్ గౌడ్,ఎస్సీ సెల్ మండల్ ప్రెసిడెంట్ నల్ల మహేందర్,మాజీ అధ్యక్షుడు గట్టు.మల్లేశ్,బొట్టు.గణపతి, తదితరులు పాల్గొన్నారు.



**కార్యకర్తలకు అండగా ఉంటా,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్.**

## అంగన్వాడి కేంద్ర్రాన్ని పరిశీలించిన కౌన్సిలర్ షరాపా బేగం ఖాజా



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,చేర్యాల, జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం,చేర్యాల కేంద్రంలోని పన్నెండవ వార్డు అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించిన కౌన్సిలర్ షరాఫా బేగం ఖాజా,అంగన్వాడి సెంటర్ ను సందర్శించి చిన్నపిల్లల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకున్న కౌన్సిలర్ షరపా బేగం ఖాజా పిల్లలకు అందవలసిన పౌష్టికా ఆహారాన్ని క్రమం తప్పకుండా అందించాలని పిల్లల ఎదుగుదల లో అంగన్వాడి సెంటర్లు ఎంత దోహదపడుతాయని అలాగే పిల్లల స్థితిగతులను అవగాహన చేసుకోవడంలో నైపుణ్యం కలుగుతుందని అన్నారు.ఈ సందర్భంగా మౌలిక వసతులను పరిశీలించిన వారికి ఇంకేమైనా అవసరాలు ఉంటే తమ దృష్టికి తేవాలని అంగన్వాడీ టీచర్ కు సూచించారు అలాగే అంగన్వాడి సెంటర్లకు శాశ్వత భవనాల కోసం మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి,ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి,సహకారంతో నూతన బిల్డింగుల ఏర్పాటుకు కృషి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ బాలమణి,ఆయమ్మ పాల్గొన్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



మనప్రజాప్రతినిధి// దినపత్రిక,బచ్చన్నపేట, జనగామ నియోజకవర్గం:జనగామ నియోజక వర్గం,బచ్చన్నపేట మండల కేంద్రంలో వాణి హై స్కూల్ లొ స్వయం పరిపాలనా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా విద్యార్థులకు పాఠాలు బోధించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారిగా ఎండీ సహారా,ఉప విద్యాశా ఖాధికారిగా యం శ్రీనాథ్,ఎంఈఓ గా కక్కర్ల అక్షయ,ప్రిన్సిపాల్ గా గుంటుపల్లి సాత్విక, కరస్పాండెంట్ గా యం. సాకేత్,వ్యవహ రించారు,ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ చేతుల మీదుగా బహుమతిలు ప్రదానం చేశారు.ఇందులో హైస్కూల్ స్థాయిలో మొదటి స్థానము యన్. దీక్షిత,ద్వితీయ. స్థానంలో బి.దీప్తి, మరియు భాషా విభాగములో యస్. నాగదుర్గ,ప్రథమ. ద్వితీయ.ఉప్పలోజు వర్షిత,ప్రైమరీ స్థాయిలో పీ.మధుప్రియ,ప్రథమ. వై.భవ్యశ్రీ,ద్వితీయ. స్థానం మరియు ఆప్షనల్ విభాగంలో సిహెచ్.ఉపేక్ష,ప్రథమ. జి.రితిక,ద్వితీయ. స్థానం అలాగే ప్రీ ప్రైమరీ విభాగం లో ప్రథమ కే.అఖిరానందన్ అలాగే ఏ.శ్రీజ ద్వితీయ స్థానం లో నిలిచారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుమలత,మాట్లాడుతూ స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించడం ద్వారా పిల్లలో నాయకత్వ లక్షణాలు పెంపొందడమే కాకుండా బాధ్యతాయుత పౌరులుగా తయారు కావటం జరుగుతుంది అని తెలియచేసారు . ఇందులో న్యాయ నిర్ణేతలుగా బి. పృథ్వీరాజు ఎస్ ఏ ఇంగ్లీష్ జడ్ పి ఎచ్ ఎస్,బచ్చన్నపేట,ఎస్ బాబు,సీ ఎచ్ స్వాతి ఉపాధ్యాయులు వాణి హై స్కూల్ వ్యవహరించారు.ఈ కార్యక్రమం లో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని వారి పిల్లల భోదనను ఆసక్తిగా తిలకించారు. అలాగే స్కూల్ ఉపాధ్యాయులు శ్వేత, షారూక్,సంధ్య,సరళ, కావ్య,స్వప్న,అనూష, శశికళ, పద్మ, రజిత, రోజా,మౌనిక పాల్గొన్నారు.

## అల్పాహార పంపిణీ




నేరేడుచర్ల (మన ప్రజాప్రతినిధి దినపత్రిక ):నేరేడుచర్ల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గుండ్రెడ్డి సైదిరెడ్డి ఆధ్వర్యంలో నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బట్టు మధు జడ్పీహెచ్ఎస్ దిర్శించర్ల జిహెచ్ఎం పుట్లూరి సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని దిర్శించర్ల మరియు నేరేడుచర్ల జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో అల్పాహార కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమాన్ని కీర్తిశేషులు ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ ముడుంబై రామానుజా చార్యులు వారి సతీమణి మంగ తాయారు సౌజన్యంతో సుమారు 15 వేల రూపాయలతో రెండు పాఠశాలలకు నెలరోజుల పాటు పదవ తరగతి విద్యార్థులకు అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి సత్యనారాయణ రెడ్డి, బట్టు మధు మరియు మంగతాయారు వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు అల్పార కార్యక్రమాన్ని మంచిగా ఉపయోగించుకొని మంచి ఫలితాలను తీసుకురావలసిందిగా పిల్లల భవిష్యత్తు కొరకు ఇట్టి కార్యక్రమాల్ని రామానుజాచారి జన్మదిన సందర్భంగా ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్స్ చల్లా ప్రభాకర్ రెడ్డి ఎడవెల్లి సత్యనారాయణ రెడ్డి క్లబ్ ఉపాధ్యక్షులు గుండ సత్యనారాయణ క్లబ్ సీనియర్ సభ్యులు సూర్యనారాయణ రెడ్డి బాల వెంకటేశ్వర్లు కొనతం ఆదిరెడ్డి బసవ కోటేశ్వరరావు కొప్పుల లక్ష్మీనారాయణ శివయ్య శివయ్య శివయ్య పాఠశాల ఉపాధ్యాయు లు వై జానయ్య ఎం సైదులు యాదగిరి నగేష్ శ్రీనివాస్ బాలు మొదలవారి పాల్గొన్నారు

## ఎమ్మెల్యే సహకారంతో నూతన బస్ సేవలను ప్రారంభించిన సర్పంచ్ నాయిని నవీన్ కుమార్

మన ప్రజాప్రతినిధి మనకొండూరు తేదీ 04 మార్చ్ :సిరిసిల్ల నుండి వేల్జిపూర్ మీదుగా ఇల్లంతకుంటకు నూతన బస్ సేవలను మానకొండూరు శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ సహకారంతో నేడు బస్సు సేవలను గ్రామ ప్రజలందరితో కలిసి ప్రారంభించిన సర్పంచ్ నాయిని నవీన్ కుమార్. ఈ సందర్భంగా మాట్లాడుతూ బస్ సేవలను గ్రామ ప్రజలు వినియోగించి ఆక్యుపెన్సిని పెంచాలని కోరారు. గ్రామ ప్రజలు ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుండ వెంకటేశం, గ్రామ శాఖ అధ్యక్షులు గొల్లకోమటి శంకర్ యాదవ్, సీనియర్ నాయకులు మూల బాల్ రెడ్డి, బొల్లారం పరశురాములు,వార్డ్ మెంబర్లు బోజ్జ శ్రీనివాస్, దేశెట్టి కవిత ,సంగేపు ముత్తవ్వ, వేములవాడ భారతి,బొల్లారం ప్రసన్నకుమార్ ,కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




## మండల స్థాయి టోర్నమెంట్ లో అంకిరెడ్డి పల్లి జట్టు విజయం

మన ప్రజా ప్రతినిధి కొండపాక మండల్ :మండల స్థాయి లో జణ= సేన నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ లో ఖమ్మం పల్లి జట్టు పై అంకిరెడ్డి పల్లి బుధవారం శివాజీ యువ సేన జట్టు విజయం సాధించింది. నిర్ణీత 12 ఓవర్లలో తొలుత బ్యాటింగ్ నిర్వహించిన ఖమ్మం పల్లి జట్టు 63 పరుగులు చేయగా, నిర్ణీత పరుగులు సాధించడంలో శివాజీ యువసేన 8.5 ఓవర్లలో లక్ష్యాన్ని సాధించి ఘన విజయం సాధించారు. ఈ మ్యాచ్ లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ నరేష్ గెలుచుకున్నాడు. ఈ మ్యాచులో సురేష్, రాజు, మహేందర్, రమేష్, శ్రీధర్, జస్వంత్, మనోహర్, అజయ్, విజ్జి పాల్గొన్నారు.



# నాగసాన్పల్లి పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలు




ముఖ్యఅతిథిగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, వినయ్ కుమార్ గ్రామ సర్పంచ్ కాశీపురం రవి ఉప సర్పంచ్ ప్రశాంత్ కుమార్

సదాశివపేట మార్చు 04 ( మన ప్రజాప్రతినిధి) :సదాశివపేట మండలం ప్రాథమిక పాఠశాల నాగుసాన్ పల్లి గ్రామం నందు బుధవారం రోజున స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించడం జరిగింది ఇట్టి కార్యక్రమం నందు నంది కంది కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వినయ్ కుమార్ గారు ముఖ్యఅతిథిగా విచ్చేయడం జరిగింది అలాగే గ్రామ సర్పంచ్ కాశీపురం రవికుమార్ ఉపసర్పంచ్ ప్రశాంత్ కుమార్ మరియు గ్రామ వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది అలాగే గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ గారు మరియు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు కూడా పాల్గొనడం జరిగింది. కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు మాట్లాడుతూ పిల్లలు స్వయంగా ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులుగా వారి పాత్ర నిర్వహించడం చాలా అభినందనీయమని భవిష్యత్తులో వారు అత్యున్నతమైన ఉపాధ్యాయ వృత్తిని చేపట్టేలా కృషి చేయాలని తెలియజేయడం జరిగింది గ్రామ సర్పంచ్ రవికుమార్ మాట్లాడుతూ మా గ్రామ పాఠశాలలో అత్యుత్తమ భోదనం ఉన్నదని తల్లిదండ్రులు పాఠశాలలో చేర్పించే వయసు గల పిల్లలందరినీ మా గ్రామ పాఠశాలలలోనే చేర్పించేలా కృషి చేస్తామని తెలియజేశారు అలాగే గ్రామ ప్రజలు విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ ఒకప్పుడు పాఠశాల అంటే వస్తువుల గోదాంలో ఉండేది అని రామ్ రెడ్డి ప్రధానోపాధ్యాయులు గారు వచ్చిన తర్వాత స్కూలు నుండి పిల్లలకు మంచి విద్యను అందించడం పాఠశాల అంటే పాఠశాల కాదని ఒక దేవాలయంల భావించేలా చేశాదని స్కూలు పరిసరాల పరిశుభ్రతను కూడా ఉంచడము పాఠశాలలో అందమైన బొమ్మలతో ఈ గ్రామంలో లేని విధంగా అలంకరించడం మేము గమనిస్తున్నామని విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు మాట్లాడడం జరిగింది .. ఇట్టి కార్యక్రమంలో సిఆర్పి ఝాన్సీ రాజేశ్వర్గౌడ్ అలాగే ఎంఆర్సి స్టాప్ నాగరాణి అక్బర్ సార్ లక్ష్మణ్ అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# రాజ్యసభ స్థానం మాదిగలకు కేటాయించాలి



-ఎమ్మార్పీఎస్ దళిత నాయకులు

మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట మార్చి 4: తెలంగాణ నుంచి భర్తీ కానున్న రాజ్యసభ స్థానాల్లో ఒకటి మాదిగ సామాజిక వర్గానికి కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈరోజు మెదక్ జిల్లా కాంగ్రెస్ క్యాంపు కార్యాలయం వద్ద పలు దళిత సంఘాల నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా ప్రతినిధి మన్నెల సుధాకర్ మాట్లాడుతూ, గత లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ఒక్క టికెట్ కూడా ఇవ్వకుండా అన్యాయం చేసిందని . ఇప్పుడు భర్తీ అవుతున్న రాజ్యసభ స్థానాల్లోనైనా మాదిగలకు ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెట్లపల్లి యాదగిరి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో అధిక జనాభా కలిగిన మాదిగలకు పార్లమెంట్‌లో రాజకీయ ప్రాతినిధ్యం లేకపోవడం విచారకరమని అన్నారు. ప్రస్తుతం ఒసిలు, బీసీలు, ఎస్టీలు, అలాగే ఎస్సీలలో మాలలకు ప్రాతినిధ్యం ఉన్నప్పటికీ, మాదిగలకు మాత్రం అవకాశం ఇవ్వలేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధిష్టానాన్ని ఒప్పించి మాదిగలకు రాజ్యసభ స్థానం వచ్చేలా చూడాల్సిన బాధ్యత తీసుకోవాలని నాయకులు కోరారు. ఇప్పటికే రాజ్యసభలో ప్రాతినిధ్యం ఉన్న వర్గాలకు మళ్లీ అవకాశం ఇవ్వడం కంటే, రాజకీయ ప్రాతినిధ్యం లేని మాదిగలకు అవకాశం కల్పించడం ద్వారా సామాజిక న్యాయం సాధ్యమవుతుందని తెలిపారు. గతంలో నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో టీడీపీ నుంచి తెలంగాణకు చెందిన ఇద్దరు మాదిగలు లోక్‌సభకు, అలాగే ఒకరు రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించిన విషయాన్ని వారు గుర్తుచేశారు. ఇటీవల భర్తీ చేసిన శాసనమండలి స్థానాల్లో కూడా మాదిగలకు ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించారు. ప్రస్తుతం భర్తీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాల్లో కనీసం ఒకదాన్ని మాదిగలకు కేటాయించాలని, లేదంటే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసనలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి పరమేష్, ఎంఎస్ పి,జిల్లా కార్యదర్శి సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి యువకులు స్వయం ఉపాధి పైనే ఆధారపడాలి



మెదక్ జిల్లా:- మన ప్రజాప్రతినిధులు దినపత్రిక :ఫిబ్రవరి తేదీ4/3/26 ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఉపాధి కోసం వచ్చే యువకులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మెదక్ మున్సిపల్ చైర్మన్ కానుగు రాధిక భూపతి రాజు అన్నారు బుధవారం రోజున మెదక్ పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్ లో చికెన్ సెంటర్ ను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ కానుగు రాధిక భూపతి రాజ్. ఈ సందర్భంగా యజమాన్యానికి కంగ్రాట్స్ తెలిపారు. ప్రైవేట్ ప్రభుత్వ ఉద్యోగాలు రాలేదని బెంగ పెట్టుకోవద్దని స్వయం ఉపాధి పైనే దృష్టి పెట్టి వ్యాపార రంగంలో ముందుకు రావాలని వారికి తెలిపారు. బుధవారం రోజున మెదక్ పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్ లో చికెన్ సెంటర్ రావడం సంతోషంగా వుందాని అన్నారు. షాప్ యజమాని నాగరాజు దృష్టి సారిస్తూ మొదటి పట్టణంలోనే నెంబర్ వన్ స్థానానికి ఎదగాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా మిత్రులు సన్నిహితులు మాజీ సర్పంచులు సర్పంచులు నాగరాజుకు శుభాకాంక్షలు తెలిపారు

# ముడు తరాల సర్పంచ్ ల ఆధ్వర్యంలో హోలీ వేడుకలు



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట మార్చ్ 04:చేగుంట మండలం చందాయిపేట్ గ్రామం లో బుధవారం నిర్వహించిన హోలీ వేడుకల్లో 2006 నుండి 2026,ముడు తరాల సర్పంచ్ లు, ఉపసర్పంచ్ లు,పాల్గొని గ్రామ ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారుఈ కార్యక్రమంలో గ్రామం లో ఉన్న వివిధ పార్టీ ల నాయకులు,కార్యకర్తలు,యువత పాల్గొన్నారు. గ్రామం లో ఉదయం నుంచే యువత, చిన్నారులు గుంపులుగా చేరి రంగులతో సందడిచేసుకుంటు హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కొందరు డీజే సంగీతం మధ్య నృత్యాలు చేస్తూ ఆనందం పంచుకున్నారు. వీధులన్నీ రంగుల మయం కావడంతో పండగ వాతావరణం నెలకొంది. స్థానికులు పరస్పరం మిఠాయిలు పంచుకుని సఖ్యతను చాటుకున్నారు. పిల్లలు, పెద్దలు ఒకరిపై ఒకరు రంగులు చల్లిఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా హోలీ వేడుకలు ప్రశాంతంగా,ఉత్సాహభరితంగాకొనసాగాయి. హోలీ పండగను ఆనందంగా, ఐక్యతతో జరుపుకోవడం ద్వారా గ్రామ ప్రజలు సాంఘిక సౌహార్దాన్ని ప్రతిబింబించారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ తాలూకా మహేశ్వరీ సాయిబాబా, ఉపసర్పంచ్ పబ్బ నగేష్ గుప్తా, మాజీ సర్పంచ్ బజారు లావణ్య జయరాం గౌడ్, మాజీ ఉప సర్పంచ్ ఆనందాస్ ఆంజనేయులు, మాజీ సర్పంచ్ నాగరాణి నగేష్, మాజీ ఉపసర్పంచ్ మల్లేష్ యాదవ్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# నాసిరకంగా పంచాయతీ భవన నిర్మాణం




నేరేడుచర్ల మండలంలో నాసిరకంగా మెటీరియల్ తో నిర్మిస్తున్న గ్రామపంచాయతీ భవనం అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల స్వార్థంతో నాసిరకమైన మెటీరియల్ వాడుతూ గ్రామపంచాయతీ భవనం కడుతున్నారు పదికాలాలపాటు ఉండే గ్రామ పంచాయతీ భవనం, నాసిరకం మెటీరియల్ వాడుతూ ఉండడంతో భవనాలు కొన్నాలకే పైకప్పు పెచ్చులూడి గోడలు కూలే ప్రమాదం ఉంది..నాసిరకం మెటీరియల్ వాడుతున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు...కొత్త గ్రామ పంచాయతీగా ఏర్పడిన గ్రామపంచాయతీని పదికాలాలపాటు ఉండాలంటే మెరుగైన మెటీరియల్ తో నియమించాలని ప్రజలు కోరుకుంటున్నారు..

మనప్రజాప్రతినిధి//నేరేడుచర్ల,మార్చి04: కొన్నాళ్లకే కాలం తీరే అవకాశం పట్టించుకోని అధికారులు,అధికారుల నిర్లక్ష్యం కాంట్రాక్టర్ల స్వార్థంతో నాసిరకమైన మెటీరియల్ వాడుతూ గ్రామపంచాయతీ భవనం కడుతున్నారని గ్రామంలో పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి ఇటీవల ప్రభుత్వం నూతన పంచాయతీలకు పంచాయతీ భవనాల మంజూరు చేసింది ఒక్కొక్క భవనానికి లక్షల్లో డబ్బులు విడుదల చేయడం జరిగింది ఇంత డబ్బుతో కట్టే భవనాలు పది కాలాల పాటు ఉండాలి అయితే నాసిరకం మెటీరియల్ వాడుతూ కడుతుండడంతో భవనాలు కొన్నాళ్లకే పైకప్పు పేచ్చులూడి గోడలు కూలి ప్రమాదం ఉంది అని గ్రామపంచాయతీ ప్రజలు లబోదిబోమంటున్నారు పూర్తి వివరాలు 2వ భాగం లో

